క్లుప్తంగా

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ రామారావు

తాళ్లపూడి: వచ్చే ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టినట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు అన్నారు. వేగేశ్వరపురంలో శుక్రవారం పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కొవ్వూరు డివిజన్‌లో 55 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి చర్యలు తీసుకుటామన్నారు. గ్రామస్తులు అల్లర్లు, గొడవల జోలికి వెళ్లవద్దని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించాలన్నారు. ఇప్పటికే పలువురిని బైండోవర్ చేశామన్నారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కొవ్వూరు రూరల్ సీఐ పి శ్రీనివాసరావు, ఎస్సై టి.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు బోరు ఏర్పాటు



బోరుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్

పెరవలి: గ్రామ రైతుల సౌకర్యార్థం, బాటసారుల దాహార్తిని తీర్చడం కోసమే బోరు వేయిస్తున్నామని సర్పంచ్ పంత బాలసుందరి తెలిపారు. అన్నవరప్పాడులో జాతీయ రహదారి సమీపంలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో బోరు ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పంత సత్యనారాయణ, యాతం పుల్లయ్య, సొసైటీ అధ్యక్షుడు పంత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఐ.పంగిడి ప్రాజెక్టు

కొవ్వూరు: ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఐ.పంగిడి జెడ్పీ హైస్కూలుకు చెందిన ప్రాజెక్టు ఎంపికైంది. పాఠశాలకు చెందిన గైడ్ టీచర్ మల్లిపూడి రాజు సహకారంతో బైశెట్టి లక్ష్మణ్ రూపొందించిన రైతుబంధు, అగ్రి కల్చరల్ ప్రాజెక్టు జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు హెచ్‌ఎం మంగిన రామారావు తెలిపారు. రాజమహేంద్రవరంలో గురువారం ఈ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. డీఈఓ కె.వాసుదేవరరావు, డీవైఈఓ ఓ.నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

నేడు రెండు ఆరోగ్య కేంద్రాలు ప్రారంభం

కొవ్వూరు: పట్టణంలో రూ.2.30 కోట్ల వ్యయంతో అత్యంత ఆధునిక హంగులతో నిర్మించిన రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ప్రారంభిస్తారు. ఉదయం పదికి గోదావరి మాత విగ్రహం సమీపంలో క్రిస్టియన్‌పేటని ఆనుకుని నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం శ్రీనివాసపురంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. క్రిస్టియన్‌పేటను ఆనుకుని నిర్మించిన ఆస్పత్రిని రూ.1.07 కోట్లతో, శ్రీనివాసపురం టోల్‌గేట్ జంక్షన్ వద్ద రూ.1.23 కోట్లతో ఆస్పత్రిని నిర్మించారు. వీటిలో రెండు ఆపరేషన్ థియేటర్లు, ఫార్మసీ, ల్యాబ్, మినీ వార్డు, వెయిటింగ్ హాలు, లేబర్ రూమ్ తదితర వసతులున్నాయి.

ఎంఈఓ విచారణ

నిడదవోలు : పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ నం.3లో ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టారనే ఆరోపణలు రావడంతో శుక్రవారం ఎంఈఓ గణేష్ విచారణ చేపట్టారు. పదో తరగతి క్లాస్ రూంలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి గదిలో ఇద్దరు విద్యార్థులు కొట్టుకుంటున్న సమయంలో డెస్క్‌పై ఉన్న పుస్తకాలు కిందపడితే, వాటిని తీసుకునే క్రమంలో డెస్క్ చివర అంచు తగిలి ఓ విద్యార్థికి గాయమైనట్టు విద్యార్థులు చెప్పారని ఎంఈఓ స్పష్టం చేశారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

దేవరపల్లి: దేవరపల్లిలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో పొగాకు బ్యారన్ దగ్ధమైంది. తన బ్యారన్‌లో మంటలు వ్యాపించి, పొగాకు కాలిపోయినట్టు రైతు సోమరాజు తెలిపారు. సుమారు రూ.1.20 లక్షల నష్టం వచ్చినట్టు చెప్పారు. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

అచ్చన్నపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం అచ్చన్నపాలెంలో శుక్రవారం జరిగింది. శిబిరాన్ని సర్పంచ్ జాలపర్తి సౌజన్య, ఎంపీటీసీ కాకర్ల రాజారావు ప్రారంభించారు. వైద్యులు సుమన, స్వాతి, పీహెచ్‌సీ డాక్టర్ సిరాజుద్దీన్ 503 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

పల్లెల్లో ప్రగతి పరుగులు

- రూ.5.51 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రారంభోత్సవానికి సిద్ధం
- గ్రామ సచివాలయ వ్యవస్థతో తీరిన ప్రజల కష్టాలు



దేవరపల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయం-2 భవనం



దేవరపల్లి దళితవాడలో రూ.12 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ

దేవరపల్లి: పల్లెల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. గతంలో ఎన్నడూ జరగని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులను అధికారులు పూర్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ఐదేళ్ల క్రితం గ్రామాల పరిస్థితి. ఇప్పటి పరిస్థితిని చూసిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేయడంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. సిమ్మెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేశారు. గతంలో కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాల కోసం ప్రజలు సుదూరంలో ఉన్న మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడానికి అష్టకష్టాలు పడేవారు. గ్రామ సచివాలయాలు వచ్చాక ప్రజల కష్టాలు తీరాయి. గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసిన అరగంటలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్నారు. హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి సకాలంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. దేవరపల్లి మండలంలోని 21 గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేసి, వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

పూర్తయిన అభివృద్ధి పనులు

మండలంలోని దేవరపల్లి, ధుమంతునిగూడెం, రామన్నపాలెం, బందపురం గ్రామాల్లో మండల పరిషత్, పంచాయతీ గడప గడపకూ.. నిధులు, ఉపాధి హామీ నిధులు, ప్రభుత్వ ప్రత్యేక నిధులు రూ.5.51 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశారు. దేవరపల్లిలో పంచాయతీ నిధులు రూ.22 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్, దళితవాడలో మండల పరిషత్, పంచాయతీ నిధులు రూ.12 లక్షలతో సిమ్మెంట్ రోడ్లు, రూ.11 లక్షలతో సీసీ డ్రైనేజీలు, మండల పరిషత్ నిధులు రూ.11 లక్షలతో నిర్మించిన బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనం, రూ.11 లక్షలతో నిర్మించిన వడ్డెరల కమ్యూనిటీ భవనం, రూ.1.45 కోట్లతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, రెండు రైతు భరోసా కేంద్రాల భవనాలు, ఒక హెల్త్ క్లినిక్ భవనం, చంద్రబాబు కాలనీలో గడప గడపకూ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సిమ్మెంట్ రోడ్డు, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన ప్రహరీ, ఇందిరమ్మ కాలనీలో గడప గడపకూ నిధులు రూ.30 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించారు. ధుమంతునిగూడెంలో రూ.61.80 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర భవనం, బందపురంలో రూ.82.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేశారు. యాదవోలులో రూ.82.60 లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రం, రామన్నపాలెంలో రూ.42.60 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ ఆయా గ్రామాల్లో ప్రారంభోత్సవాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు సిద్ధం చేశారు.

ముందస్తు ప్రణాళికతో..



పంచాయతీలో ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. మంచినీరు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. గత మూడేళ్లుగా గ్రామ పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో సుమారు రూ.9.45 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం. జగనన్న లేఅవుట్‌లో 1,400 మంది పేదలకు ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. ఇంటింటికీ ఉచితంగా కుళాయి ఇవ్వడానికి ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరు చేసింది. ప్రజాప్రతినిధులు, పాలకవర్గం, అధికారుల సహకారంతో జిల్లాలో దేవరపల్లి పంచాయతీని మోడల్‌గా తయారు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా.

– కడిమి వీరకుమారి, సర్పంచ్, దేవరపల్లి

నిర్మాణాలు పూర్తయ్యాయి



మండలంలోని దేవరపల్లి, బందపురం, ధుమంతునిగూడెం, రామన్నపాలెం, యాదవోలు గ్రామాల్లో మండల పరిషత్, గడప గడపకూ నిధులు, ఉపాధి హామీ నిధులు, గ్రామ పంచాయతీ నిధులతో రూ.5.51 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సిమ్మెంట్ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలు, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం జరిగాయి. మండలంలో 21 గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి.

– షాజహాన్, ఏఈ, పంచాయతీరాజ్

అంగరంగ వైభవంగా రథ సప్తమి



వేలివెన్ను సూర్యనారాయణమూర్తి పల్లకీని మోస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

తాళ్లపూడి: రథ సప్తమి పర్వదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రక్కిలంకలో మాఘమాసం నెల లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న 15వ సౌరయాగంలో భాగంగా, రథసప్తమి సందర్భంగా రథ యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రక్కిలంక, పైడిమెట్ట, తాళ్లపూడి గ్రామాల్లోని వీధుల్లో రథోత్సవం కొనసాగింది.

పల్లకీ సేవలో ఎమ్మెల్యే

ఉండ్రాజవరం: వేలివెన్నులోని సూర్యభగవానుడి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉషా, ఛాయ, పద్మినీ, సంజ్ఞా సహిత సూర్యనారాయణస్వామికి కల్యాణం నిర్వహించారు. స్వామివారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పూజలు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి ఘనంగా నిర్వహించారు. సూర్యదేవుడికి అభిషేకం నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో, సర్పంచ్ పంతం బాలసుందరి పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి

ఉండ్రాజవరం : రథసప్తమి పర్వదినాన్ని అనేక గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలివెన్ను సూర్యాలయంలో కొలువైన సూర్యభగవానుడి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి.

వైఎస్సార్ సీపీని గెలిపించడానికి సిద్ధం

- పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్
- కొవ్వూరులో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం
- ఎన్నికల సమరానికి సిద్ధం కండి : ఎమ్మెల్యే తలారి



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరి శ్రీనివాస్

కొవ్వూరు: రాష్ట్రంలో డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.4.78 లక్షల కోట్లు పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చినందున, ప్రజలంతా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. కొవ్వూరు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగనన్న పాలనలో 13.50 లక్షల కోట్ల పెట్టుబడులు, 358 పరిశ్రమలు, 4 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ చేసి చూపించారన్నారు. విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం కల్పించి, విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన మధ్య వత్యాసాన్ని ప్రజల్లో తీసుకెళ్లాల్సిన బాధ్యత బూత్ కమిటీలు తీసుకోవాలని సూచించారు. ఈ ఎన్నికలు పెత్తందారులు, పేదలకు మధ్య సాగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు పేద ప్రజలకు మళ్లీ సక్రమంగా అందాలంటే వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి

మరో పదివారాల్లో ఎన్నికలున్నాయని పార్టీ శ్రేణులంతా రానున్న రోజుల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. ప్రతి బూత్‌కు కన్వీనర్‌తో పాటు ముగ్గురు సభ్యులుంటారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, సువర్ణ పాలన అందిస్తున్న విషయాన్ని ప్రతి ఓటరుకు వివరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని జగనన్న మెరుగ్గా అమలు చేసి, చిన్నప్పటి నుంచి చదువులకు తోడ్పాటు అందించాలన్న సంకల్పంతో అమ్మఒడి పథకం అమలు చేశారన్నారు. మేము సిద్ధం, మా బూత్ సిద్ధమని పార్టీ శ్రేణులతో నినాదాలు చేయించారు. ప్రతి బూత్ స్థాయిలో 70 నుంచి 80 శాతం మంది ఓటర్లు వైఎస్సార్ సీపీ పట్ల సానుకూలంగా ఉన్నారన్నారు. వారందరితో ఓట్లు వేయించుకోవాల్సిన బాధ్యత బూత్ కమిటీ సభ్యులపై ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి మాట్లాడారు. జెడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



వేలివెన్నులో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ఉండ్రాజవరం: సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. వేలివెన్ను గ్రామంలోని జగనన్న కాలనీ, బీసీ, ఎస్సీ ఏరియాల్లో రెండో రోజు శుక్రవారం జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు పింఛన్లు ఇస్తున్నారన్నారు. పథకాల కోసం ఎవరైనా నాయకుల వద్దకు తిరిగారా, లంచాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. పిల్లల మంచి భవిష్యత్తు, చదువుల కోసం ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందన్నారు. ఎంపీటీసీ మల్లిపూడి పాప, సొసైటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందం, శిరిగిన శివరాధాకృష్ణ, పి.పార్వతి, బూరుగుపల్లి పద్మ, దిద్దుపూడి గంగాభవాని, దిద్దుపూడి గోపాలం, చదలవాడ హరీష్, మల్లిపూడి సురేష్, ఆబోతు భాస్కరరావు, కండెల్లి రామకృష్ణ, గెడ్డం రాజు, బత్తిన దివాకర్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు



ఉనకరమిల్లిలో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నిడదవోలు రూరల్: సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఉనకరమిల్లి గ్రామంలో రూ.70 లక్షలతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంక్, వాటర్ పైపులైన్ పనులు, సీసీ డ్రెయిన్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేసి, శిలాఫలాకాలను ఆవిష్కరించారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలంతా మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, సర్పంచ్ పోలిరెడ్డి భారతి, ఎంపీటీసీ పెనుగుర్తి రాము, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తిరుమలశెట్టి అయ్యప్ప, నాయకులు పోలిరెడ్డి శివరామకృష్ణ, మీసాల ప్రసాద్, సింగంశెట్టి సత్యనారాయణ, కోసూరి అప్పారావు, గుంటుపల్లి రామచంద్రరావు, తిరుమళ్ల దుర్గారావు, జక్కంశెట్టి పాటేశ్వరరావు, జి.మనోహర్ పాల్గొన్నారు.

పాల వెల్లువపై అవగాహన

చాగల్లు: జగనన్న పాల వెల్లువను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.బుజ్జి అన్నారు. శుక్రవారం చంద్రవరం సచివాలయం వద్ద సర్పంచ్ మద్దిపాటి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఏపీఎం మంగయమ్మ, పశువైద్యాధికారి యు.ముకేష్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ఎత్తుగడలు చిత్తు చేయాలి

- హోం మంత్రి తానేటి వనిత
- కార్యకర్తలకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వనిత

గోపాలపురం: వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాల ఎత్తుగడలు చిత్తు చేయాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర హోం, విపత్తుల శాఖా మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మాయమాటలు చెప్పడానికి ప్రజల ముందుకు వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కరగపాడు, కొవ్వూరుపాడు, గుడ్డిగూడెం, సంజీవపురం పంచాయతీల్లో శుక్రవారం ఆమె వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో 99 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత పాలకులు అమలు కానీ హామీలు ఇచ్చారని, బడ్జెట్‌లో పెట్టిన ఒక్క పని కూడా చేయకుండా, నిధులన్నీ స్వాహా చేశారని దుయ్యబట్టారు. గోపాలపురం నుంచి గుడ్డిగూడెం మీదుగా సాగిపాడుకు 15 కి.మీ. రోడ్డు నిర్మాణానికి ఈ నెల 20న శ్రీకారం చుట్టనున్నట్టు మంత్రి ప్రకటించారు. కొవ్వూరుపాడులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొవ్వూరు నుంచి భీమోలు మీదుగా గుడ్డిగూడెం వయా దొండపూడి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించడంతో ఆయా గ్రామాల ప్రజలు మంత్రిని పూలమాలలతో సత్కరించారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, నాయకులు ఎస్‌కే వలీ, వెలగా శ్రీరామమూర్తి, సర్పంచ్‌లు బొమ్మిన నాగమణి, చిలకా లక్ష్మణస్వామి, మడిచర్ల ప్రసాద్, ఇళ్ల శ్రీరామమూర్తి, ఎంపీటీసీలు యడ్లపల్లి సూరిబాబు, బండి కనకదుర్గ, ఏఎంసీ ఉపాధ్యక్షుడు తోట నాగేశ్వరరావు, వింత అమర ప్రసాద్‌రెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బూత్ కన్వీనర్లతో సమావేశం

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో మంత్రి వనిత పాల్గొన్నారు. రాబోవు ఎన్నికల్లో బూత్ ఏజెంట్లు ప్రధాన పాత్ర పోషించాలని ఆమె తెలిపారు. నకిలీ ఓట్లు, దొంగ ఓట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల బూత్ కమిటీల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ప్రజాప్రతినిధులు అలసత్వం వహిస్తే సహించేది లేదని గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షత వహించారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. పలువురు అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మండల స్థాయి సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ మండలంలో 15 లేఅవుట్లలో 1,260 గృహాలు, సొంత స్థలం ఉన్నవారికి 2,131 ఇళ్లు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ సీహెచ్ వెంకటరావు మాట్లాడుతూ మండలంలోని అన్నదేవరపేట, పెద్దేవం, గజ్జరం లేవుట్లలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన 95 మందికి ఉచితంగా మీటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌ఐ భారతి మాట్లాడుతూ మండలంలో 1,799 మందికి ఇంటి స్థలాలు ఇచ్చామని, 90 డేస్ కింద 565 మంది అర్హత పొంది ఉన్నారని వివరించారు. పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఏఈ టి.కృష్ణసాయి మాట్లాడుతూ మండలంలో 15 సచివాలయాల్లో 14, 14 రైతు భరోసా కేంద్రాల్లో 13, 9 విలేజ్ హెల్త్ సెంటర్లల్లో 7 పూర్తయ్యాయని తెలిపారు. సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, నామా గోపాలం తదితరులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఏఈ లేక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. పూర్తయిన నిర్మాణాలకు, ఇతర పనులకు బిల్లులు చేయడం లేదన్నారు. 90 రోజుల్లో వారికి ఇంటి స్థలాలు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పేర్కొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీడీఓ వెంకటరమణ, కొవ్వూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై శ్యామ్ సుందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, నామా శ్రీనివాస్, ఎల్లిన శివ, గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకటరావు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

నల్లజర్ల: ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి ఎంపీడీఓ నరేష్‌కుమార్ సూచించారు. మండలంలో ఈ నెల17 నుంచి 29 వరకు నిర్వహించనున్న సామాజిక తనిఖీలకు సంబంధించిన బృందాలు, ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామసభలకు సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, వేతనదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. తనిఖీ బృందాలు ఇంటింటా తనిఖీలు చేసే సమయంలో ఫీల్డు అసిస్టెంట్లు ఉండకూడదన్నారు. తనిఖీ బృందాలకు అవసరమైన రికార్డులు అందించాలన్నారు. ఏపీఓ జీవీ రమణ, ఎస్ఆర్‌కే తులసీనాయక్, ఇద్దరు ట్రైనీ సబ్ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి వార్షికోత్సవ వేడుకలు

దేవరపల్లి: షిర్డీ సాయినాథుడి మందిర 28వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రథ సప్తమి సందర్భంగా సాయినాథునికి విశేషపూజలు నిర్వహించారు. ఈ నెల 20 వరకు వేడుకలు జరుగుతాయని మందిర కమిటీ సభ్యులు తెలిపారు.

కేంద్ర వ్యతిరేక విధానాలపై సమ్మె

కొవ్వూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం కొవ్వూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఐ.పంగిడి గ్రామంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో, నిరసన ర్యాలీ నిర్వహించారు.

వ్యవసాయ, కార్మిక సంఘాల ధర్నా

నిడదవోలు: రైతులపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ వ్యవసాయ, కార్మిక సంఘాల ఐక్యవేదిక గ్రామీణ భారత్ బంద్ పిలుపు మేరకు పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్ విజయవంతం

పెరవలి: కేంద్ర వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతం అయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. పెరవలిలో శుక్రవారం గ్రామీణ బంద్‌లో భాగంగా బ్యాంకులు, పోస్టాఫీసులు మూయించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.